క్లుప్తంగా

మోడల్ పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

రాయికల్ : మండలంలోని కుమ్మర్‌పల్లి, ఉప్పుమడుగు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఆదివారం జగిత్యాల ఆర్డీవో నర్సింహమూర్తి పరిశీలించారు. అనంతరం బోర్నపెల్లిలోని చెక్‌పోస్టును ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ చెక్‌పోస్ట్ వద్ద నిఘా పెంచాలని, ప్రతి వాహనం క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ఖయ్యూం, ఆర్ఐ కాంతయ్య ఉన్నారు.

కులసంఘాలకు బీఆర్ఎస్ ప్రాధాన్యం



సమావేశమైన కులసంఘాల సభ్యులు

కథలాపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వం కులసంఘాలకు ప్రాధాన్యతనిచ్చిందని, ఈ ఎన్నికల్లో మద్దతు తెలపాలని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి కోరారు. ఆదివారం కథలాపూర్ మండలం దూలూర్‌లో యాదవ, మున్నూరు కాపు, విశ్వబ్రాహ్మణ, ముదిరాజ్ సంఘం సభ్యులతో వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. సంఘం సభ్యులంతా తాము బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తామని ప్రతిజ్ఞ చేశారు. సంఘాల అభివృద్ధికి ఎంతో కృషి చేశామని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ గుండారపు సౌజన్య, జెడ్పీటీసీ నాగం భూమయ్య, నాయకులు వెంకటేశ్వర్‌రావు, గుండారపు గంగాధర్, మిట్టపెల్లి గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడిలో రాయికల్ కళాకారుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన అంజశ్రీ,రసజ్ఞ

రాయికల్: హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో భారతి ఆర్ట్స్ అకాడమీ ఫౌండేషన్ పద్మభూషణ్ చిన్నసత్యం మాస్టర్ 94 వ జయంతి సందర్భంగా ఆదివారం సిరిసిరిమువ్వలు, కూచిపూడి నృత్యాలు పోటీలు నిర్వహించగా రాయికల్‌కు చెందిన బొమ్మకంటి అంజనశ్రీ, బండి రసజ్ఞ కూచిపూడి ప్రదర్శన చేసి జ్ఞాపికలు అందుకున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

సారంగాపూర్: మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో నిర్మిర్మించనున్న దాసాంజనేయస్వామి ఆలయానికి భక్తులు, గ్రామస్తులు భారీగా నగదు, వస్తు రూపేణా విరాళాలు అందజేస్తున్నారు. ఆదివారం గ్రామానికి చెందిన భూక్య రవినాయక్ రూ. 25 వేలు, గడ్డం మహిపాల్‌రెడ్డి రూ. 51 వేలు, మానేరు హరీశ్ రూ. 10 వేలు, ఇందనుపెల్లి పక్కీర్ రూ. 18 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో గురుస్వామి గంగాదర్, పొంపర్తి రంజిత్, రఘుపతిరెడ్డి, మహేశ్, తిరుపతి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేత



అందుకున్న బహుమతులతో విద్యార్థినులు

కోరుట్ల: పట్టణంలోని సాయిబాబా ఆలయంలో రాష్ట్ర వంజరి సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా అధ్యక్షుడు బొమ్మిరి శంకర్ ఆదివారం చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ వంజరి విద్యార్థులు బాగా చదివి మరిన్ని ప్రోత్సాహకాలు అందుకోవాలన్నారు. కార్యక్రమంలో వంజరి సంఘం నాయకులు తుక్కారాం, బోదుకం సుధాకర్, రవి, రాజు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూం వద్ద నిరంతర నిఘా

- ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు
- నియోజకవర్గంలో 269 పోలింగ్ కేంద్రాలు
- 79 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తింపు
- నేటి నుంచి శిక్షణ తరగతులు



ధర్మపురిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల స్ట్రాంగ్‌రూం వద్ద పోలీసుల పహారా

ధర్మపురి : శాసనసభ ఎన్నికల్లో భాగంగా ధర్మపురి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్ట్రాంగ్ రూం వద్ద నిరంతరం పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి (స్థానిక సంస్థల అదనపు కలెక్టర్) దివాకర ఆధ్వర్యంలో ధర్మపురి నియోజకవర్గంలో మొత్తం 269 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నియోజకవర్గ పరిధిలో ధర్మపురితో పాటు వెల్గటూర్, ధర్మారం, ఎండపెల్లి, పెగడపెల్లి, గొల్లపెల్లి, బుగ్గారం ఏడు మండలాలను 26 రూట్‌లుగా విభజించారు. మోడల్ కోడ్స్ ఎఫ్ఎస్‌టీ 6, వీఎస్‌టీ 6, స్టాటిక్ సర్వేలెన్సు 9, వీడియో సర్వేలైన్సు 9 లను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని 269 పోలింగ్ కేంద్రాల్లో 269 ర్యాంపులను ఏర్పాటు చేసే దిశలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అదే విధంగా నియోజకవర్గంలో మొత్తం 79 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. 80 ఏళ్లకు పైబడిన వృద్ధులు ఓటు వేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. యువకులు, మహిళల కోసం ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ధర్మపురిలో ఏర్పాటు చేసిన స్ట్రాగ్ రూం, పోలింగ్ కేంద్రాల్లో నిరంతరం నిఘా కోసం 9 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసారు. ఎన్నికల నామినేషన్ స్వీకరణ కేంద్రం, పంపిణీ కేంద్రం, పోలింగ్ కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సౌకర్యం, తాగునీటి వసతులు, ఎన్నికల సిబ్బందికి ఇచ్చే శిక్షణా కేంద్రాల వద్ద అన్ని వసతుల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

నేటి నుంచి శిక్షణా తరగతులు

శాసనసభ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వర్తించడానికి ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు రెండు రోజుల పాటు శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నారు. ధర్మపురిలోని నూతనంగా నిర్మించిన గిరిజన వసతి గృహంలో నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు మాస్టర్ ట్రైనర్ల ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు ఏర్పాటు చేస్తున్నారు. ఉ. 8.30 నుంచి మధ్యాహ్నం 1.15 ని.లకు తిరిగి. మధ్యాహ్నం నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉదయం 7 బ్యాచులకు, మధ్యాహ్నం 7 బ్యాచులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తారు. ఒక్కో బ్యాచులో సుమారు 50 మంది వరకు ఉంటారు. శిక్షణా తరగతులకు ఏర్పాట్లు చేశారు.

చేపట్టిన ఏర్పాట్లు

- ధర్మపురిలోని తహసీల్దార్ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ కేంద్రం ఏర్పాటు చేశారు.ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్ట్రాంగ్ రూం ఏర్పాటుతో పాటు పంపిణీ కేంద్రం ఏర్పాటు
- స్ట్రాంగ్ రూంలో ఈవీఎం యంత్రాలు, వీవీ ప్యాట్లను భద్రపరిచేందుకు ప్రత్యేక సీసీ కెమెరాల ఏర్పాటు
- పోలింగ్ కేంద్రాల్లో మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో నిరంతర విద్యుత్ సౌకర్యం, తాగునీటి వసతులు కల్పించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.
- నియోజకవర్గంలో 79 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఒక్కో కేంద్రానికి ఒక సూక్ష్మ పర్యవేక్షణ అధికారిని నియమించనున్నారు.
- 80 ఏండ్లు పైబడి నడవలేని వృద్ధులను గుర్తించి వారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గంలో 4289 మంది ఉన్నట్లు అధికార లెక్కల ద్వారా తెలిసింది.
- 269 పోలింగ్ కేంద్రాల్లో ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక వైద్య సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నారు.
- పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించడానికి ఉపాధ్యాయులకు నేటి నుంచి రెండు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు.

అక్రమ నిర్మాణాలు ఆపాలని కులసంఘాల ధర్నా



కథలాపూర్‌లో రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు

కథలాపూర్: మండలకేంద్రంలోని ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఓ కులసంఘానికి చెందిన భవనం నిర్మిస్తున్నారని, నిర్మాణం ఆపాలని కోరుతూ గ్రామ కులసంఘాల సభ్యులు ఆదివారం రోడ్డుపై ధర్నా చేశారు. గ్రామ అవసరాల కోసం వినియోగించుకునేందుకు ఆ స్థలం అవసరమని, అందులో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని పలుమార్లు పంచాయతీరాజ్ శాఖ అధికారులకు వినతిపత్రం ఇచ్చినా స్పందన కరువైందని గ్రామస్తులు మండిపడ్డారు. ఈ మేరకు గ్రామస్తులు నిర్మాణం చేపట్టిన భవన ప్రహరీని కూల్చివేశారు. వివాదం ముదరడంతో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోరుట్ల, మెట్‌పల్లి సీఐలు ప్రవీణ్‌కుమార్, లక్ష్మీనారాయణ, ఎస్సైలు కిరణ్‌కుమార్, చిరంజీవి ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. కాగా కథలాపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి చెదలు నారాయణ బైక్‌ను కారుతో ఢీకొట్టినందుకు చింతకుంట గ్రామానికి చెందిన చెదలు సత్యనారాయణపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. కథలాపూర్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్కంఠ పరిస్థితులు నెలకొన్నాయి.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

జగిత్యాల: ఇటీవల బదిలీ ఉత్తర్వులు అందుకుని రిలీవ్ కాని ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని, దీనితో పాటు పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బోగ రమేశ్ అన్నారు. ఆదివారం దరూర్ క్యాంపు కార్యాలయంలో ఖమ్మం మహాసభలకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ నిలిచిపోవడం దురదృష్టకరమని, ఎంతో మంది ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారన్నారు. కనీసం బదిలీ పొందిన ఉపాధ్యాయులను వెంటనే విడుదల చేయాలని, ఉపాధ్యాయుల కొరత ఉన్న చోట సర్దుబాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి రాంచంద్రం, రఘుపతి యాదవ్, సూద రాజేందర్, ఎడ్ల గోవర్ధన్, అప్పాల గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

విశ్వరూప సన్నాహక సదస్సు విజయవంతం చేయాలి



నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రం అందిస్తున్న సతీశ్

- ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ బెజ్జంకి సతీశ్ మాదిగ

సారంగాపూర్: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పాల్గొనే విశ్వరూప సన్నాహక సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా కోకన్వీనర్ బెజ్జంకి సతీష్ మాదిగ అన్నారు. ఆదివారం మండలంలోని రంగపేటలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వచ్చే నెల 2న మాదిగల విశ్వరూప సన్నాహక సదస్సులో మందకృష్ణ మాదిగ పాల్గొంటారని, విజయవంతం చేయాలని కోరారు. అనంతరం రంగపేటలో గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా బెక్కం ప్రవీణ్, ప్రధానకార్యదర్శిగా మకిలి సాగర్, కోశాధికారిగా బెక్కం సాయన్న, కార్యదర్శిగా బెక్కం హర్షవర్ధన్ నియమితులయ్యారు. కార్యక్రమంలో సారంగాపూర్ మండల ఇన్‌చార్జి మీసాల చంద్రయ్య, గాలిపెల్లి సురేశ్, మారంపల్లి శ్రీను, బెక్కం శ్రీను, బెక్కం సుధాకర్ పాల్గొన్నారు.

రైతులకు పంట నష్ట పరిహారం అందించాలి

మెట్‌పల్లి: గత వర్షాకాలంలో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శి గంగోని క్రాంతి ఆదివారం కోరారు. వర్షాలతో వందలాది ఎకరాల్లో పంటలు దెబ్బతినడం వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తామని ప్రకటించి, ఇంతవరకు ఆ దిశగా చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే పరిహారం నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

స్నేహితుడి కుటుంబానికి సాయం



వెల్గటూర్: తమతో పాటు చదువుకున్న స్నేహితుడు మరణించగా, స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకోవడానికి తోటి స్నేహితులు ముందుకు వచ్చారు. వెల్గటూర్ ప్రభుత్వ పాఠశాలలో 1990–91లో పదో తరగతి చదివిన కోటిలింగాల గ్రామానికి చెందిన అడ్డగట్ల రవికుమార్ వెల్గటూర్‌లో బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో మరణించాడు. రవికుమార్‌తో చదువుకున్న మిత్ర బృందం అందరూ కలిసి తమవంతుగా సేకరించిన రూ.57,500 స్నేహితుడి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో బందెల ఉదయ్‌గౌడ్, బొమ్మలకుంట మన్‌మోహన్, మిత్రులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



20 ఏళ్ల తరువాత కలుసుకున్న మిత్రులు

గొల్లపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 2003–2004లో పదోతరగతి చదివిన మిత్రులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా 20 ఏళ్ల కిందట టెన్త్ బ్యాచ్‌కు చెందిన 80 మంది మిత్రులు కలుసుకుని తమ యోగ క్షేమాలు పంచుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న తోటి మిత్రులకు చేయూత అందించాలని నిర్ణయించుకున్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా బీఆర్ఎస్ ప్రచారం



కీచులాటపల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు

పెగడపల్లి: కొప్పుల ఈశ్వర్ గెలుపు కోసం మండల బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. పెగడపల్లి మండలంలోని కీచులాటపల్లి, నంచర్ల, నందగిరి, అయితిపల్లి, నర్సింహనిపేట, బతికపల్లి, దోమలకుంట, వెంగళాయిపేట గ్రామాల్లో ఆదివారం నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించి ఎన్నికల మెనిఫెస్టోను పంచుతూ, మంత్రి ఈశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి పనులను వివరించి కారు గుర్తుకు ఓటేసి ఈశ్వర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అడ్వైజరీ కమిటి చైర్మన్ ఆనందం, సురేందర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకన్న, మహిళా అధ్యక్షురాలు సుంకరి మమత, ఆర్‌బీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, విండో చైర్మన్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కాంగ్రెస్ నాయకుల ప్రచారం



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సారంగాపూర్: మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డికి ఓటు వేయాలని, కాంగ్రెస్ పార్టీ అధికారంలో వస్తే 200 యూనిట్ల వరకు ప్రతి ఇంటికి విద్యుత్ చార్జీలు ఉండవని, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, మహాలక్ష్మీ పథకం కింద ప్రతి ఇంటిలోని మహిళలకు రూ. 2500 నెల నెలా అందిస్తుందని, రైతు భరోసా కింద ఏడాదికి ఎకరాకు పంట పెట్టుబడి సాయం కింద రూ.15 వేలు, కౌలు రైతుకు వర్తింపజేసే కార్యక్రమాలు, రైతులతో పాటు, కూలీలకు బీమా సౌకర్యం వంటి కార్యక్రమాలపై గడపగడపకు ప్రచారం చేశారు.

గడప గడపకూ కాంగ్రెస్ ప్రచారం



ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

మేడిపల్లి: భీమారం మండలకేంద్రం, తోంబరావుపేటలో గడప గడపకు కాంగ్రెస్ అనే నినాదంతో ఇంటింటా ప్రచారం చేశారు. ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను ఓటర్లకు వివరించారు. కార్యక్రమంలో రమేశ్‌రెడ్డి, నరేశ్ రెడ్డి, జంగంపల్లి విజయ్, రాజేందర్ రెడ్డి, సాయిని గంగారెడ్డి, నర్సారెడ్డి, దాసరి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వికాస్ రావు పర్యటన



నినాదాలు చేస్తున్న వికాస్‌రావు, నాయకులు

మేడిపల్లి: మండలంలోని మాచాపూర్, దమ్మన్నపేట, కల్వకోట, వల్లంపల్లి గ్రామాల్లో ఆదివారం బీజేపీ నాయకుడు వికాస్‌రావు పర్యటించారు. సుమారు 400 వందల మంది వివిధ పార్టీలకు చెందిన యువకులు బీజేపీ మండల ఉపాధ్యక్షుడు తొగరి లక్ష్మిపతి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వికాస్‌రావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యకర్తల సూచనలు, సలహాలు, ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చర్చించారు. మండల ప్రధాన కూడలిలో చాయ్ పే చర్చాలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జలపతిరెడ్డి, దశరథరెడ్డి, జగన్‌రెడ్డి, ఎస్ఎస్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, మకిలి ఇజ్రాయిల్, ఎంపీటీసీ రాజు, ఆదే రమేశ్, నాగెల్లి మహేశ్, రఘు, లింగాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, గంగారాం, గంగాప్రసాద్ పాల్గొన్నారు.

మేడిపల్లి మండలంలో నాయకుల ప్రచారం



ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మేడిపల్లి: మండలంలోని కాచారం, వెంకట్రావుపేట గ్రామాల్లో ఆదివారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోని వివరించారు. వచ్చే ఎన్నికల్లో చల్మెడను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అడ్వకేట్ శ్రీపాల్‌రెడ్డి, సర్పంచ్ సురేశ్, రావు శ్రీనివాస్, అజిత్‌రావు, భూమేష్ గౌడ్, సాయిరావు, చీటి వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బట్టల వర్తక సంఘం మెట్‌పల్లి అధ్యక్షుడిగా సదానందం



ఎన్నికైన నూతన కార్యవర్గసభ్యులు

మెట్‌పల్లి రూరల్: మెట్‌పల్లి పట్టణ బట్టల వర్తక సంఘం అధ్యక్షుడిగా దార్న సదానందం ఎన్నికయ్యారు. ఆదివారం మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ శివారులోని కొండ స్వామి ఆలయం వద్ద బట్టల వర్తక సంఘం ఎన్నికలు జరిగాయి. ప్రధానకార్యదర్శిగా లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా రవీందర్, సహాయ కార్యదర్శిగా ప్రసాద్, కోశాధికారిగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఎన్నికైన కార్యవర్గాన్ని పలువురు శాలువాలతో సన్మానించారు. సంఘం బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు సదానందం పేర్కొన్నారు.

గోపా అధ్యక్షుడిగా బత్తిని నిరంజన్‌గౌడ్

రాయికల్: మండల గౌడ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్(గోపా) నూతన కార్యవర్గంను ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బత్తిని నిరంజన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా పోతుగంటి సురేష్‌గౌడ్, కోశాధికారిగా గుగ్గిల్ల రాము, ఉపాధ్యక్షులుగా ఏనుగందుల శ్రీనివాస్‌గౌడ్, కైరం రమణ, కార్యనిర్వాహణ కార్యదర్శిగా కైరం సత్తయ్యగౌడ్, సంయుక్త కార్యదర్శిగా పెగ్గెర్ల నర్సయ్య, కార్యవర్గ సభ్యులుగా నందయ్య, సంతోష్, నాగరాజు, రాజేందర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారి దుర్గ శ్రీనివాస్‌గౌడ్, పరిశీలకులు సదాశివ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కిందపడి వ్యక్తి మృతి

బుగ్గారం: చేపల వేటకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా మార్గ మధ్యలో ప్రమాదవశాత్తు కిందపడి తలకు బలమైన గాయాలు కావడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుగ్గారం మండలం చిన్నాపూర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, బంధువుల వివరాల ప్రకారం.. చిన్నాపూర్ గ్రామానికి చెందిన చల్లూరి శ్రీనివాస్(50) సమీపంలోని వెల్గొండ శివారులో ఓ కెనాల్ వద్ద చేపల వేటకు వెళ్లాడు.కొంతసేపటి తర్వాత చేపలు పట్టుకుని ఇంటికి తిరుగుపయనమయ్యాడు. నడుచుకుంటూనే ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో అదుపుతప్పి కిందపడిపోగా తలకు బలమైన గాయాలు అయ్యాయి. కొద్దిసేపటి తర్వాత స్థానికులు గమనించగా అప్పటికే మృతి చెందాడు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాలలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.మృతుడికి భార్య,ఇద్దరు కుమారులు ఉన్నారు.

పేకాటరాయళ్ల అరెస్ట్

రాయికల్: మండలంలోని రామాజీపేట శివారులో కొందరు పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి తనిఖీలు చేయగా నలుగురు పేకాట ఆడుతూ పట్టుబడ్డారని ఎస్సై అజయ్ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.7,860, సెల్‌ఫోన్లు, ఐదు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామని, మరో ముగ్గురు పరారీలో ఉన్నారని వివరించారు.